BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ 10-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు


## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ వాయిదా

### జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఎదుట వాదోపవాదనలు



**మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ మరోమారు వాయిదా పడింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది సోమవారం ఉదయం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఎదుట అనర్హత పిటిషన్‌పై వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి తరపున ముకుల్ రోహత్గీ తన వాదనలు వినిపించారు. అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాది.. స్పీకర్ నుంచి మరింత సమాచారం కోసం సమయం కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందజేస్తామన్నారు. ఈ క్రమంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని, ఇప్పటికే 10 నెలలు పూర్తి అయ్యిందని, ఇంకెంత గడువు కావాలని ప్రశ్నించారు. చివరకు ముకుల్ విజ్ఞప్తితో పిటిషన్ పై విచారణను వాయిదా వేసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చిన విషయం తెల్సిందే. పార్టీ మారడంపై వివరణ ఇవ్వాలని 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. అయితే వివరణ ఇచ్చేందుకు తమకు 40 రోజుల గడువు కావాలని స్పీకర్‌కు సమాధానం ఇచ్చారు. అసెంబ్లీ తరపు న్యాయవాదులతోపాటు సొంతంగా అడ్వకేట్లను పెట్టుకున్నారు.



## ధర్మ రక్షకులపై దాడులా?

### రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు: కేటీఆర్

**మహా, హైదరాబాద్:** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం కేటీఆర్ బీఆర్ఎస్ నేతలతో కలిసి రంగరాజన్ నివాసానికి చేరుకున్నారు. అనంతరం దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మాట్లాడిన తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రంగరాజన్‌పై దాడిని చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని అర్థమవుతుందన్నారు. అలాగే రంగరాజన్‌ను అవమానిస్తే దేవుడిని అవమానించడమేనని, ఆయనపై దాడికి పాల్పడిన నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేటీఆర్ కోరారు. అలాగే చిలుకూరు బాలాజీ ఆలయం దగ్గర భద్రత పెంచాలని ప్రభుత్వానికి, పోలీసులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున తాము రంగరాజన్ కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పుకొచ్చారు. కాగా ఆయన పై జరిగిన దాడిని తెలంగాణలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, హిందు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

## స్కిల్ యూనివర్సిటీకి నిధులు ఇవ్వలేం

### లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ




**మహా, న్యూఢిల్లీ:** తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిధులు ఇవ్వలేమని కేంద్రం స్పష్టం చేసింది. సోమవారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్కిల్ యూనివర్సిటీ అంశాన్ని ప్రస్తావించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్నారు. దీని కోసం రాష్ట్రం రూ.100కోట్లు కేటాయించింది. కార్పస్ ఫండ్‌ను సుమారు రూ.300 నుంచి 500 కోట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని గ్రాండ్ సక్సెస్ చేయడానికి, 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశం' లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తగిన నిధులు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రతిపాదన ఉందా? అని ప్రశ్నించారు. చామల కిరణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన కేంద్ర మంత్రి జయంత్ చౌదరి .. స్కిల్ యూనివర్సిటీకి తాము నిధులు ఇవ్వలేమని చెప్పారు. రాష్ట్రాలు తమ చట్టాల ప్రకారం స్కిల్ వర్సిటీలు ఏర్పాటు చేశాయి. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే కేంద్ర పథకమేదీ లేదన్నారు. అయితే ఇతర స్కీమ్ ల ద్వారా క్రెడిబిలిటీ కలిగిన సంస్థలకు సహకారం అందిస్తామని తెలిపారు.


Mahaa First

మహా తెలుగు దినపత్రిక

స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి

JOIN OUR WhatsApp CHANNEL

వాయు వేగంతో

Join Our Exclusive WhatsApp Channel


# ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్‌కు అభ్యర్థులే లేరు

## తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య దోస్తీ

### కేటీఆర్, కవిత, హరీశ్‌రావు మధ్య మూడు ముక్కలాట

### టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



**మహా, గజ్వేల్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులే లేరని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని అన్నారు. బీజేపీకి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉంటే బడ్జెట్ లో తెలంగాణకు వచ్చిన నిధులు గాడిద గుడ్డు అని ఆక్షేపించారు. ఇక్కడి బీజేపీ నేతలకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం ఆనవాయితీగా వస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతిస్తోందని ఆరోపించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ దోస్తీ**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీ రెండు పార్టీలు దోస్తీ చేస్తున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫాంహౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. గజ్వేల్ ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌లో కేసీఆర్ సేద తీరుతున్నారని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని అన్నారు. సోమవారం సిద్ధిపేట జిల్లా గజ్వేల్ రిమ్మన్నగూడ ఎస్ 4 వద్ద మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి బీఆర్ఎస్ బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ఎన్నికలకు వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

**బీసీల గురించి బీఆర్ఎస్ మాట్లాడటమా?**

మాజీ మంత్రి కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్ కవిత హరీష్ మధ్య మూడు ముక్కలాట నడుస్తోందని విమర్శలు చేశారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రీ సర్వే జరపమని అడిగే అర్హత లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలను నెరవేర్చామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కరీంనగర్ లో కదం తొక్కిన కాంగ్రెస్ ధూంధాంగా ర్యాలీ



**మహా, కరీంనగర్:** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ ర్యాలీకి జనం పోటెత్తారు. భారీ కాన్వాయ్ తో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కి చేరుకుంది. ఈ ర్యాలీలో టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.